'ఏం! ఆ మంచంమీదే. వొంటికి వొళ్లు తగలకూడదా ఏమిటి?'

కృపావతికి ముచ్చెమటలు పట్టినాయి. 'రా, సిగ్గేమిటి? ఇద్దరమూ ఆడాళ్లమేకదూ' అంటూ కృపావతిని నడుముమీద చెయ్యివేసి తీసికెళ్ళి క్యాంపు కాటుమీద పడుకోబెట్టింది డాక్టరు లీల.

కృపావతి గుండెలు దడదడ కొట్టుకొన్నాయి. ఆమె శరీరమంతా భయంతో ముద్దయిపోయింది.

'భయమేమిటీ' అంటూ తనుకూడా ఆ మంచంమీదే పడుకుంటూ కృపావతిని దగ్గరగా లాక్కొని రొమ్ముకి అదుముకుంది లీల.

# ధర్మసందేహం

నలుగురమూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాము. ఆమాటా, ఈమాటా నుంచి మా సంభాషణ శృంగారంమీదికి వెళ్ళింది. ప్రతివాడూ తన అనుభవాలనూ, తాను విన్న యితరుల అనుభవాలనూ చెప్పడం ఆరంభించాడు.

ఉన్నట్టుగావుండి శేషయ్య "నాకొక అనుభవం జరిగింది. చెపుతాను వినండి" అన్నాడు, తక్కిన ముగ్గురమూ మేం చెప్పదలచుకున్న వాటిని మానేసి, శేషయ్యను చెప్పమన్నాము.

సాధారణంగా మా నలుగురిలోనూ శేషయ్య చాలా తక్కువగా మాట్లాడుతూ వుంటాడు. అతను ఏ సంగతి చెప్పినా చాలా అద్భుతంగా వుంటుంది. అతను చెప్పిన విషయాన్ని విని మేము ఎంతోసేపు ఆశ్చర్యంతో అలాగే వుండిపోయేవారము.

మేము ఏదైనా చెపితే, అసలు జరిగిన దాంట్లోనుంచి కొంత విడిచెయ్యడమే మామూలు. శేషయ్య అలాకాదు. జరిగింది జరిగినట్లుగా, చక్కగా చెప్పేవాడు. ఎప్పటికప్పుడు కొత్తకథలు చెపుతూ వుండేవాడు. అంచేత యీసారి ఏం చెపుతాడో అని మా అందరికీ కుతూహలం కలిగింది.

అతను ఇలా చెప్పాడు. "అప్పుడు నాకు ఇరవయ్యోయేడు. ఇప్పుడు నేను

చెప్పబోయేది జరిగి పదిహేనేళ్లు అయింది.

మా వూళ్ళో, మాకు దగ్గర బంధువులే ఒక కుటుంబం వున్నారు. వాళ్ళ అమ్మాయిని మావూరికి ఏడెనిమిది మైళ్ళ దూరంలోవున్న ఒక వూళ్ళో యిచ్చారు. ఆమె భర్త యాభైయేళ్ళవాడు. రెండో పెళ్ళి లెండి. ఈ అమ్మాయి-అన్నట్టు ఆమె పేరు రమణ-కాపురానికి వెళ్ళక పూర్వం రోజూ మా యింటికి వస్తూవుండేది.

మావూళ్ళోకాదు, యీవూళ్ళోకాదు, మరేవూళ్ళోను కాను—ఆపిల్లతో సమానమైన చక్కదనంగల పిల్లను నేను ఇంతవరకు చూడలేదు. ఆ రమణను నేనుచూసి పదిహేనేళ్ళు అయిందనుకోండి. ఈ పదిహేనేళ్ళలోను రమణ ఎంతో మారిపోయివుంటుంది. ఏమయినా సరే, ఇప్పుడు నేను మీతో ఆనాటిసంగతి చెపుతున్నాను కదా, రమణ ఆనాటిరూపమే నాకళ్ళ ఎదుట పట్టినట్టుంది. ఆ రూపం చాలా అందమైన రూపం.

రమణ మా యింటికి వచ్చినపుడల్లా నన్నొకసారి పలుకరించకుండానూ, ఏదో హాస్యమాడి నన్ను నవ్వించకుండానూ, వెళ్ళేదికాదు. కొన్నాళ్ళు నాకు ఏమిటో అనిపించిందికాని, ఎలాగయితేనేమి నేను ఆమెను ప్రేమిస్తున్నాను అని గ్రహించాను. అప్పటినుంచీ నేను ఆమెతో ఏమి మాట్లాడినా రెండు అర్థాలు వచ్చేటట్టు మాట్లాడేవాణ్ణి. ఆమె మాటలలోకూడా నాకు రెండు అర్థాలు కనిపించేవి. అంచేత ఆమెకు నామీద మనసు ఉన్నదని నిర్ధారణ చేసుకున్నాను.

రమణకు తల్లిలేదు. వాళ్ళ యింట్లో వున్నవాళ్ళు రమణ తండ్రీ, రమణా ఇద్దరే.

ఒకరోజున రమణ తండ్రీ మావూరికి దగ్గరగానే వున్న వేరొక గ్రామం వెళ్లాడు. వెళ్ళేటప్పుడు మా యింటికి వచ్చి “చూడు చెల్లెమ్మా, రమణ ఒక్కత్తీ వుంటుంది. మీ యింటికిపోయి పడుకోమని చెప్పాను. కాస్త ఈ రాత్రికి దాన్ని కనిపెట్టి వుండమ్మా” అని మా అమ్మకు చెప్పాడు.

“అలాగేలే అన్నయ్యా” అని మా అమ్మ అన్నది.

నాకు ఎంచేతనో గుండెలు దబదబా కొట్టుకొన్నాయి. ఇవ్వాళ వీలు చిక్కిందికదా అనుకున్నాను. సంతోషమో, ఆదుర్దాయో, ఉత్సాహమో, గాభరాయో నాకు తెలియదుకాని నా వొళ్ళంతా ముచ్చెమటలుపోసి గజగజ లాడింది. ఆకాశంలో నా శరీరం ఎగిరిపోతుందా అనుకున్నాను.

రమణ తండ్రి వెళ్ళిపోగానే, ప్రొద్దు బాగా ఏటవాలిన తరువాత నేనే రమణగారి యింటికి బయలుదేరాను. ఎలా వెళ్లానో, నా తలలో ఏమి వూహాలు కలిగాయో నేను యిప్పుడు చెప్పలేను. మొత్తంమీద రమణగారి యింటికి వెళ్లాను, తలుపుకొట్టాను. రమణవచ్చి తలుపు తీసింది. సంజచీకటి అయితేనేమి, రమణ కట్టుకొన్నది నల్లచీర అయితేనేమి, ఆమె ముఖం తళుక్కుమని మెరిసింది. నవ్వుతూ 'రా బావా!' అన్నది. ఆమె నవ్వుకు ఆ వూరంతా తన్మయత్వం పొంది వుంటుంది. నేను లోపలికి వెళ్ళాను. నా వెనకాలే ఆమెకూడా వచ్చింది. నేను మంచంమీద కూచుని "కాసిని మంచినీళ్ళు యియ్యి రమణా" అన్నాను.

రమణ మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. మంచినీళ్ళగ్లాసు ఆమె చేతిలోనుంచి అందుకుంటూ, ఆమె బుగ్గమీద చిటికవేశాను. ఆమె నవ్వింది. నేను చిరునవ్వు నవ్వుకున్నాను. మంచినీళ్లు త్రాగుతూవుండగా గుమ్మంలో చప్పుడైంది. వీధితలుపు వెయ్యడం రమణ మరిచిపోయింది. గుమ్మంలో చప్పుడు వినగానే ఆమె నిలుచున్నచోటినుంచి రెండడుగులు వెనకకు వేసింది. ఇంతలోనే, ఆమెభర్త అక్కడ ప్రత్యక్షమయాడు. నేను తెల్లబోయాను.

"రా అన్నా, ఇదేనా రావటం"అని అతణ్ణి నేను ఆహ్వానించాను. "ఊ" నంటూ అతను మంచంమీద చతికిలబడ్డాడు.

"మామ ఊరికివెళ్లాడు. రమణని మా యిట్లోపడుకోమన్నాడట. మా అమ్మ పిలుచుకు రమ్మన్నది. ఇక నువ్వే వచ్చావు గనుక నేను వెడతాను" అంటూ, కత్తు కలిపి ఏదో మాట్లాడి నాదారిన నేను యింటికి వెళ్ళాను. రమణ భర్త వచ్చాడని మా అమ్మకు చెప్పాను. రమణను పిలుచుకొని రావడానికివెళ్లే ప్రయాణాన్ని మా అమ్మ మానుకున్నది.

అక్కడికి అది అయిందా; రమణను ఆమె భర్త తనవూరు తీసుకొని వెళ్ళాడని నాకు మరునాడు తెలిసింది!

ఏంచేస్తాం గనుక! మాట్లాడక వూరుకున్నాను.

అలా కాలం గడిచిపోయింది. ఆరునెలలు గడిచిపోయాయి. ఓనాడు ఉదయం రమణయింటివీధిలో వెడుతూ వుండగా, “బావా, కులాసాగా వున్నావా?” అని ఆప్తులు ఎవరోపిలిచారు. ఆ పిలుపు ఎవరిదో కాదు. రమణే. అయితే, యిదివరకు లేని కొత్తమాధుర్యం ఏదో రమణ గొంతులో నాకు వినిపించింది.

“ఎప్పుడు వచ్చావ్ రమణా?” అని అడిగాను.

“రాత్రి వచ్చా బావా” అన్నది. రమణ. రమణ మొహం అంతకు పూర్వంకంటె ఎంతపొగ్గా వుందనుకున్నారు. ఏదో కొత్త నాజూకుతో ఆమె ఎంతో దివ్యంగా వుండండి! కాని ఏం లాభం!

ఆ తరువాత రమణ మా యింటికు వస్తూవుండేది. ఏదో ఎకసెక్కాలు ఆడుకుంటూ వుండేవాళ్ళము.

ఒకనాడు మా పెరట్లో బావిదగ్గర స్నానంచేస్తూ వుండగా రమణ అక్కడికి వచ్చింది.

“ఓహో, మరదలు పిల్లా” అని పలకరించి ‘ఏమిటీవిశేషాలు’అని అడిగాను.

“విశేషాలులేవు, ఏమీలేవు. మానాన్న యివ్వాళ వూరికి వెళ్లాడు; నాలుగు రోజులుదాకా రాడట” అన్నది రమణ.

నా మనస్సు ఎలా పనిచేసిందో కాని; “చీకటిపడే టప్పటికి వస్తాను. సిద్ధంగావుండు” అన్నాను. ఆమాట చెపుతూ, నేను రమణమొహం చూడ లేదు. కాని, ఆమె అందుకు ఒప్పుకుంటుందని నాకు తెలుసు. నాకు సమాధానం చెప్పకుండా రమణ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆనాడు ప్రొద్దు ఎప్పుడు గ్రుంకుతుందా అని నేను పడ్డ అవస్థ యింతా అంతా కాదు. నా ప్రాణం విసిగించి, విసిగించి ఎలా అయితేనేం ప్రొద్దు గూకిందనుకోండి.

నేను ఏవిధంగా తయారైతే జగన్మోహనంగా వుంటానని నేను అనుకుంటానో అలా తయారయానండీ. బయలుదేరి రమణగారి యింటిదగ్గరకు వెళ్లాను. ఇదివరకల్లా ఏ సంకోచమూ లేకుండా యింట్లోకి జొరపడేవాడిని. కాని యిప్పుడు అలా చెయ్యడానికి నాకు భయం వేసింది. జనం ఎవరూ చూడకుండా లోపల జొరబడదామని, ఆ యింటికి కొంచెం దూరంలోవున్న ఆంజనేయ మండపంమీద కూచున్నాను, దిక్కులు చూస్తూ. రమణ రెండుమూడుసార్లు బయటకు తొంగిచూసింది. తళుక్కుని ఆమె ముఖం మెరిసినట్లు అనిపించేది. ఆమె తల్లో పెట్టుకున్న మల్లెపూల వాసన నాదగ్గరకు పరుగెత్తుకొని వచ్చినట్లుండి.

రమణ బయటికి వచ్చినప్పుడల్లా, ఆవీధిలో ఎవరో ఒకరు నడుస్తూనే వుండేవారు. అంచేత నేను కూచున్న చోటినుంచి కదలలేక పోయాను. మావూళ్లో అంతమంది వున్నందుకూ, వాళ్లంతా పనిలేకుండా యిలా తిరుగుతూ వున్నందుకు వాళ్లను తిట్టుకుంటూ, ఎప్పటికైనా ఆ వీధి నిర్మానుష్యం కాదా అని కనిపెట్టుకొని కూచున్నాను.

ఇంతట్లో, ఎక్కడనుంచి వచ్చిపడిందో, టక టక లాడుకుంటూ, ఊగుతూ ఒక గుర్రబ్బండి వచ్చి రమణగారి యింటిముందు నిలచిందండీ. నా మనస్సుకు ఎలా వుంటుందో మీరే ఊహించుకోండి. ఎవరబ్బా అని చాలా నిరుత్సాహంతో అటే చూస్తూ కూచున్నాను. కాని ఆ బండిలోనుంచి ఎవరూ క్రిందకు దిగరు. బండివాడుమాత్రం, క్రిందకు దిగి గుర్రాన్ని పట్టుకొని అలాగే నిలచున్నాడు.

నిమిషమో, రెండు నిమిషాలో గడిచి వుంటాయి. ఎవరో ఒక మనిషి నడచివచ్చి యింటిలో జొరబడ్డాడు. ఇంట్లోనుంచి ఏడుపులు వినబడ్డాయి. ఆ మనిషి మళ్ళీ బయటికి వచ్చాడు. ఆతడున్నూ బండివాడున్నూకలిసి బండిలోనుంచి పొడుగుపాటి ఒక శరీరాన్ని క్రిందకు దింపారు. అదేమిటో తెలుసా!

...రమణ భర్త శవం.''

అని చెప్పి శేషయ్య కొంచెం ఆగాడు.

మా అందరికీ గొంతులో ఏదో అడ్డం పడినట్లయింది.

"అదేమిటండీ?" అన్నాను నేను. శేషయ్య మళ్లీ అందుకుని యిలా అన్నాడు.

"ఏముంది. ఆమె భర్త కొత్తగా ఒక కోడెదూడను కొన్నాడట. దానిని బండికికట్టి తోలుతున్నాడట. అది, ఏంచేతనోగాని బెదిరి ఆ బండిని లాక్కొని మిట్టనక పల్లమనక పరుగెత్తి ఒక గోతిలోకి తోసిందట. రమణ భర్త బండి క్రింద పడి చచ్చిపోయాడట. జరిగిన సంగతి ఇది. కాని ఆమె భర్త మరణానికి కారణం నేను అయినట్లూ, ఆపాపం అంతా నా నెత్తి మీద వున్నట్లూ నాకు అనిపించింది. ఈ పదిహేను సంవత్సరాలు నేను రమణ మొహం చూడలేదు." అని శేషయ్య ముగించి వేశాడు.

# ఆ స మ య ం

ఆరు నెలల అబ్బాయిని తీసుకుని, పుట్టింటి నుంచి అత్తింటికి ప్రయాణం కడుతూ వుండగా, కలరా తగిలి భర్త చనిపోయాడని మంగమ్మకి కబురు తెలిసింది. గోడు గోడున దుఃఖిస్తూ తన దురదృష్టాన్ని తిట్టుకుంది. ఆరు నెలల పిల్లాడి అదృష్టలేమికి విచారించింది.

అత్తారిల్లంటే మంగమ్మకి, అత్తా, మామా, ఆడుబిడ్డలూ ఎవరూ లేరు. ఇద్దరు మరదులున్నారు. వారిద్దరికీ భార్యలున్నారు. వాళ్ళలో ఎవరికీ పిల్లలు లేరు.

అన్నదమ్ములు ముగ్గురూ వుమ్మడిగానే వుండి, పొలమూ పంటా చూసుకుంటూ వుండే వారు, తమ్ముళ్లు యిద్దరికీ అప్పుడప్పుడు యేవైనా పోట్లాటలు వచ్చినా, పెద్దన్న సర్ది వేస్తూ వుండేవాడు. పెద్దన్న అంటే తమ్ముళ్లిద్దరకీ గురి అవడంచేత అతని మాటా, పెత్తనమూ సాగిపోవడమే కాక, మంగమ్మ అంటే కూడా మరదులకి కొంచెం నమ్రత వుండేది. అంచేత వాళ్ల భార్యలు కూడా మంగమ్మ విషయంలో చాలా గౌరవభావాన్ని చూపిస్తూ